క్లుప్తంగా

ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



ఫతేహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. ఏటా రంజాన్ నెలలో దర్గాకు భక్తుల తాకిడి తక్కువగా ఉంటుంది. గత నెల 31వ తేదీ రంజాన్ పండుగ ముగియడంతో ఈ వారం దర్గా భక్తులతో కిటకిటలాడింది. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్గాకు తరలివచ్చారు. జెండాలు, పూలదట్టీలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఇంటర్ విద్యార్థుల ఖాతాలకు ఉపకార వేతనాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ఖాతాల్లో మలబార్ గోల్డ్ కంపెనీ మంజూరు చేసిన ఉపకార వేతనాలు జమ అయినట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 80 శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులకు రూ. 10 వేలు చొప్పున, 70 శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులకు రూ.8 వేలు చొప్పున స్కాలర్‌షిప్‌లు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రతిభ చూపిన పేద విద్యార్థులకు మలబార్ సంస్థ ఉపకార వేతనాల రూపంలో ప్రోత్సాహకాలు అందజేయడం అభినందనీయం అని ప్రిన్సిపాల్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

డోన్ టౌన్: స్థానిక పాత బస్టాండ్ సర్కిల్‌లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని చైర్మన్ రాజేష్, కమిషనర్ హరి ప్రసాద్ గురువారం ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. వైస్ చైర్మన్‌లు కొట్రికె హరికిషన్, జాకీర్‌హుస్సేన్, కౌన్సిలర్లు రైల్వే నాగేంద్ర, సుంకయ్య, డీఈ రఘు, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

సంజామల ఏపీఓగా బాధ్యతలు

సంజామల: మండల ఏపీఓగా బి.జయంతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఎన్‌ఆర్‌జీఎస్ కార్యాలయంలో ఏపీఓగా పనిచేస్తున్న ప్రకాష్‌రావు అవుకు మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మిడుతూరు మండలంలో పనిచేస్తున్న బి.జయంతి సంజామలకు వచ్చారు. కూలీలందరికీ పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

ఆస్పత్రిలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీ



రోగుల సహాయకులకు భోజనం వడ్డిస్తున్న జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారులు

బనగానపల్లె రూరల్: స్థానిక వంద పడకల ఏరియా ఆస్పత్రిలో ఇన్‌పేషంట్‌లకు అందించే భోజనాన్ని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, ఖాసీంవలి గురువారం తనిఖీ చేశారు. నాణ్యతను పరిశీలించారు. రోగులకు ఉచితంగా అందించే భోజనంలో తప్పనిసరిగా నాణ్యత పాటించాలని సూచించారు. నమూనాలు సేకరించి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు తీసుకెళ్లారు. వైద్యశాల సీఎస్‌ఆర్‌ఎంఓ శిరీష, వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

సాయిబాబాకు వెండి కిరీటం కానుక



వెండి కిరీటం అందజేస్తున్న దాతలు

డోన్ టౌన్: పట్టణంలోని సాయిబాబా ఆలయానికి రూ.1.50 లక్షల విలువ చేసే వెండి కిరీటాన్ని కానుకగా సమర్పించారు. స్థానిక కృష్ణా లాడ్జి యజమాని కేతపల్లి సుదర్శన్ గుప్తా, హరిత దంపతులు గురువారం బాబాకు ప్రత్యేక పూజలు చేసి ఆలయ కమిటీ సభ్యులకు కిరీటాన్ని అందజేశారు.

అటకెక్కిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ

- గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభమైన శిక్షణ కేంద్రం
- కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మూతపడిన వైనం
- స్వయం ఉపాధికి నోచుకోలేకపోతున్న మహిళలు
- శిక్షణ కేంద్రం పేరు చెరిపివేత మినహా చేసింది శూన్యం



ప్యాపిలిలో మూతపడిన నైపుణ్యాభివృద్ధి కేంద్రం



కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు (ఫైల్)

ప్యాపిలి: మహిళలకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి చేయూత ఇవ్వాలని గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్యాపిలిలో బుగ్గన శేషారెడ్డి నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత ఏడాది జనవరి 3వ తేదీ అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. శిక్షణ కేంద్రంలో కుట్టు మిషన్లు ఏర్పాటు చేసి మహిళలకు కుట్టులో శిక్షణ ఇస్తూనే వారు కుట్టిన వస్త్రాలను విక్రయించి తద్వారా మహిళలు ఆదాయం పొందాలన్నది ఈ కేంద్రం ఉద్దేశం. శిక్షణ కేంద్రం ప్రారంభించిన కొద్ది నెలలకే సార్వత్రిక ఎన్నికలు రావడంతో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఒక్కసారిగా నైపుణ్యాభివృద్ధి కేంద్రం మూత పడింది. దాదాపు 10 నెలలుగా నైపుణ్యాభివృద్ధి కేంద్రం తెరచుకోకపోవడంతో కుట్టుమిషన్లతో పాటు ఇతర పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి.

రూ. 8 లక్షలతో భవనం ఆధునీకరణ

పట్టణంలోని స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి ఆనుకుని ఉన్న పట్టు పరిశ్రమ కేంద్రంలోని భవనాన్ని గత ప్రభుత్వ హయాంలో రూ. 8 లక్షలతో ఆధునీకరించారు. ఈ భవనంలోనే నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చి నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కేంద్రంలో మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌పై శిక్షణ ఇవ్వడంతో పాటు వారు కుట్టిన దుస్తులకు మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పించారు. ఒక బ్యాచ్‌లో 30 మందికి చొప్పున శిక్షణ ఇచ్చి..శిక్షణ ముగిసిన తర్వాత ఇదే కేంద్రంలో వారికి ఉపాధి అవకాశాలు కల్పించే ఏర్పాటు చేశారు. శిక్షణ కేంద్రం ప్రారంభించాక రెండు బ్యాచ్‌లకు సంబంధించి మొత్తం 60 మంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నారు.



కేంద్రానికి ఉన్న బుగ్గన శేషారెడ్డి పేరును చెరిపేసిన దృశ్యం

పేరు చెరిపేయడం తప్ప చేసింది శూన్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఇతర కార్యక్రమాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ప్యాపిలిలో ఏర్పాటు చేసిన నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని సైతం కొనసాగించకుండా ఆపేశారు. ఇటీవల ఈ శిక్షణా కేంద్రానికి ఉన్న బుగ్గన శేషారెడ్డి నైపుణ్య అభివృద్ధి కేంద్రం పేరులోని బుగ్గన శేషారెడ్డి అనే పేరును గుర్తు తెలియని వ్యక్తులు చెరిపేశారు. గతంలో డోన్ నియోజకవర్గానికి విశిష్ట సేవలు అందించిన మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బుగ్గన శేషారెడ్డి పేరు బోర్డుపై ఉండడం కూడా జీర్ణించుకోలేకపోవడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. పేరును చెరిపేయకుండా శిక్షణ కేంద్రం పునఃప్రారంభమయ్యేలా చేసి ఉంటే మహిళలకు ఉపాధి అవకాశాలు లభించేవనే అభిప్రాయాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి

సారా విక్రేతల అరెస్ట్

డోన్ రూరల్: నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పలు చోట్ల దాడులు నిర్వహించామని తెలిపారు. సారా విక్రయిస్తున్న ప్యాపిలి మండలం అలేబాద్‌తండా గ్రామానికి చెందిన శ్రీరాములునాయక్, డోన్ పట్టణంలోని చిగురుమాన్‌పేట కాలనీకి చెందిన కొత్తూరు మౌలాలమ్మ, కొయికొండ లక్ష్మీదేవి, ఎరుకలి ఆంజినేయను అరెస్టు చేశామని వెల్లడించారు. వీరి నుంచి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని బైండోవర్ కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. సీఐ లక్ష్మణదాసు, ఎస్‌ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్స్ సుధాకర్‌రెడ్డి, గోపాల్ సింగ్, ఉమాకాంత్‌రెడ్డి, రంగస్వామి పాల్గొన్నారు.



పట్టుబడిన సారాను చూపుస్తున్న సీఐ

పారదర్శక ఓటర్ల జాబితాకు సహకరించాలి



రాజకీయ పార్టీ నాయకుల సమీక్ష సమావేశంలో తహసీల్దార్

కోవెలకుంట్ల: తప్పులు లేని, పారదర్శక ఓటర్ల జాబితా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తహసీల్దార్ పవన్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఓటు హక్కులేని 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు, మృతి చెందిన ఓటర్ల తొలగింపు తదితర వివరాలు అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ లిస్టులో తప్పులుంటే సవరించుకోండి

సంజామల: మండలంలోని ఓటర్ లిస్టులో ఏవైనా తప్పులు ఉంటే సవరించుకోవాలని తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. సంజామల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ అనీల్ కుమార్ సమావేశం నిర్వంచారు. మండలంలో మొత్తం 32,384 మంది ఓటర్లు ఉన్నాయని..జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉందన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు తోట వెంకటేశ్వర్‌రెడ్డి, బాబఇమాం, చిన్నయ్య, మిల్కి ఉస్సేన్, విష్ణు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సేవా సభ్యులు

కోవెలకుంట్ల: పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని వక్తలు అభిప్రాయ పడ్డారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక నాగుల కట్ట వద్ద గురువారం చలివేంద్రం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ చైర్మన్ సముద్రాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మానవత సంస్థ అంబులెన్స్, ఫ్రీజర్ ఏర్పాటు చేయటమే కాకుండా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని కొనియాడారు. సంస్థ సేవలను మెచ్చి టౌన్ బ్యాంకు చైర్మన్ రూ. 10 వేలు విరాళం అందజేశారు. సంస్థ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యక్షుడు జీవీ సుబ్బారెడ్డి, సెక్రటరీ రామసుబ్బారెడ్డి, జీవీ సుబ్బారెడ్డి, కోశాధికారి మల్లికార్జున రావు, టౌన్ బ్యాంకు మేనేజర్ విక్రమ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: మండల పరిధిలోని ఎద్దుపెంట గ్రామంలో సర్పంచ్ జయచంద్ర ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. తొలి రోజు కావడంతో మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్‌లో భారత్ గ్యాస్ డీలర్ రాజా విజయ్‌కుమార్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ ప్రారంభించారు.

అకాల వర్షం.. రైతుల టెన్షన్

- ఉరుములు, మెరుపులతో వర్షం
- వేసవితాపం నుంచి ఉపశమనం
- వరి, మొక్కజొన్న, మిరప రైతుల ఆందోళన



కోవెలకుంట్లలో కురుస్తున్న వర్షం,



ఆకుమల్ల ప్రధాన రహదారిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

కోవెలకుంట్ల: ఉపరితల ద్రోణి ప్రభావంతో వేసవికాలంలో వర్షాలు కురుస్తున్నాయి. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో గురువారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతీవ్రత అధికంగా ఉండి సాయంత్రానికంతా ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని మోస్తరు వర్షం పడింది. వేసవితాపంతో అల్లాడిపోతున్న ప్రజలు వర్షం నుంచి ఉపశమనం పొందారు. వర్షంతో వాతావరణం చల్లబడగా రైతులను అకాల వర్షభయం వెంటాడుతోంది. ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పైరు చేతికందే దశలో ఉంది. మొక్కజొన్న కోత, నూర్పిడి పనులు కొనసాగుతున్నాయి. మిరప చివరి కోత పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వర్షం కారణంగా కల్లాల్లో ఆరబోసిన మిరప, మొక్కజొన్న దిగుబడులు తడవకుండా పట్టలు కప్పుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. ఈదురుగాలులకు పొట్టదశలో ఉన్న వరి నేలవాలడంతో వడ్లు రాలిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో ఇరవై రోజులపాటు వర్షాలు పడకుంటే దిగుబడులు చేతికందుతాయని రైతులు వాపోతున్నారు.

- **అవుకు/సంజామల:** ఆయా మండలాల పరిధిలో గురవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. రైతన్నలు కల్లాల్లో ఆరబోసిన ధాన్యం దిగుబడులను కాపాడుకోవడానికి అవస్థలు పడ్డారు. మండలంలో ప్రస్తుతం మిరప, పొగాకు కోతలు జరిగి కల్లాల్లో ఆరబెట్టారు. రెండు రోజుల పాటు వర్ష సూచన ఉందని.. రైతులు కోత కోసిన పంటను కాపాడుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు.



సౌదరదిన్నెలో మిరప దిగుబడులు తడవకుండా కప్పిన పట్టలు

- **డోన్ టౌన్:** పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల మధ్య పలు దఫాలుగా వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

అవుకు: నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి, నంద్యాల ఈఎస్ టాస్క్‌ఫోర్స్ సీఐ లక్ష్మణ్‌దాస్ హెచ్చరించారు. అవుకు మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామంలో సారా తయారీ కేంద్రాలపై గురువారం దాడులు నిర్వహించారు. 600 లీటర్ల బెల్లం ఊటను పారబోసి, 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన నొస్సం నాగన్న నిందితుడిగా గుర్తించారు. ఎస్‌ఐలు కమలాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని సిద్దనగట్టు గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా శనివారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ. 12,500 చొప్పున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఏడో స్థానం వరకు బహుమతులు ఉంటాయన్నారు. అలాగే 6వ తేదీ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేత జట్లకు వరుసగా రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు చొప్పున నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.500 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

సీతారాములకు వెండి కిరీటాల బహూకరణ

బేతంచెర్ల: శంకరాపురం గ్రామంలోని రామాలయంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, సుజాతమ్మ దంపతులు వెండి కిరీటాలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండ్లవానిపల్లె గ్రామంలో సుంకులా పరమేశ్వరి, జంబుల పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట పూజల్లో పాల్గొన్నారు.

ఎర్ర బ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



కోవెలకుంట్ల డిపో గేటు ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



డోన్ డిపో గేటు ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

కోవెలకుంట్ల: డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో గేటు ఎదుట గురువారం ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు శివరాం మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి 138 డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గత నెల 25 తేదీ రాష్ట్ర కమిటీ నాయకులు ప్రభుత్వానికి వినతి పత్రం అందజేశారన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో నిరసన చేపట్టామన్నారు. 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, నైట్ సర్వీస్ అలవెన్స్‌ను రూ. 150 నుంచి రూ. 400లకు పెంచాలని, అక్రమ సస్పెన్షన్లు ఎత్తి వేయాలని, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ఖాన్, గుర్రప్ప, నాగేష్, రమణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

డోన్ టౌన్: ఆర్టీసీ డిపో ఎదుట ఎస్‌ఎంయూ కార్మికులు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. డిపో అధ్యక్షుడు కేవీ రామయ్య, కార్యదర్శి బాలమద్దయ్య, సహాయ కార్యదర్శులు నాగార్జున, శివలింగేశ్వర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

కోవెలకుంట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బనగానపల్లె నియోజకవర్గంలో పార్టీ మండల కమిటీలను నియమించారు. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

- **బనగానపల్లె మండలం:** పార్టీ మండల ఉపాధ్యక్షులుగా బాదినేని శ్రీనివాసులు, ఆకుమల్ల కంబగిరి, జనరల్ సెక్రటరీలుగా అత్తార్ అఖిల్ ఉసేన్, కె. వెంకటసుబ్బారెడ్డి, గంగినేని ప్రతాప్, కె. వెంకటేశ్వర్లు, సెక్రటరీలుగా బి.జగదీశ్వరరెడ్డి, షేక్ ఖానిక్, ఎస్.మాదవ కృష్ణ, గడ్డం బాషా, మద్దిమధును నియమించారు.
- **కోవెలకుంట్ల మండలం:** పార్టీ మండల ఉపాధ్యక్షులుగా చిట్రెడ్డి మోహన్‌రెడ్డి, ఈర్నపాటి ఉప్పరి సుబ్బరాయుడు, జనరల్ సెక్రటరీలుగా ఖాతా నిరంజన్ చంద్రమౌళీరెడ్డి, బోయ శంకరయ్య, పోతం రాంమోహన్‌రెడ్డి, సోముల లోకేశ్వరరెడ్డి, సెక్రటరీలుగా దూదేకుల నడిపి ఉసేనయ్య, దండె వెంకటశేషిరెడ్డి, బూస ప్రభాకర్‌రెడ్డి, పట్నం శ్యాం సుందర్, అరదేశి దేవ నియమితులయ్యారు.
- **కొలిమిగుండ్ల మండలం:** ఉపాధ్యక్షులుగా రంగారెడ్డిగారి గుర్విరెడ్డి, దూదేకుల దస్తగిరి, జనరల్ సెక్రటరీలుగా నీలం సంజీవకుమార్‌రెడ్డి, వెంకటశేషఫణి, గంటా శంకరయ్య, మల్లెల సోమయ్య, సెక్రటరీలుగా కొలిమిగుండ్ల దానమయ్య, కె. సుబ్బయ్య, ఎం. కంబగిరి నాయుడు, ఎం. ఈశ్వరయ్య, ఎస్. ఓబులేసును నియమించారు.
- **సంజామల మండలం:** ఉపాధ్యక్షులుగా అంబవరం ఉసేన్‌సాహెబ్, దాయపులే వెంకటసుబ్బారావు, జనరల్ సెక్రటరీలుగా అనిపిరెడ్డి నాగిరెడ్డి, బుర్రా రెడ్డిపల్లె రాజు, దాట్ల సర్వేశ్వరరెడ్డి, సంధ్యపాకుల జయరాజు, సెక్రటరీలుగా ఏరాశి శ్రీనాథరెడ్డి, సూదుల కుపేంద్రారెడ్డి, బెల్లం రాజు, కానాల వెంకటరమణ, సోగల లక్ష్మి రాముడును నియమించారు.
- **అవుకు మండలం:** పార్టీ మండల ఉపాధ్యక్షులుగా పేరం వెంకటసుబ్బారెడ్డి, మూరబోయిన మనోహర్, జనరల్ సెక్రటరీలుగా కోనేటి పెద్దన్న, కైప పార్థసారధిరెడ్డి, కొమ్ముసాని చిన్న కంబగిరి స్వామి, పేరి అంకన్న, సెక్రటరీలుగా దూదేకుల కంబగిరిరాముడు, వల్లెపురెడ్డి మహేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, బి.నాగిరెడ్డి, బి.మధుసూదన్‌రెడ్డిని ఎంపిక చేశారు.

శీలంకు సత్కారం

డోన్: స్థానిక బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన శీలం భాస్కర్‌నాయుడును వాల్మీకి సంఘం నాయకులు గురువారం ఘనంగా సత్కరించారు. వాల్మీకి రామయ్య, వాల్మీకి సంఘానికి చెందిన న్యాయవాదులు క్రిష్ణమూర్తి, శివరామక్రిష్ణ పాల్గొన్నారు.

శ్రీరామునికి ప్రత్యేక పూజలు

అవుకు: స్థానిక చాకలిపేటలోని రామాలయంలో ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశ స్థాపన నిర్వహిస్తున్న నేపథ్యంలో నిర్వాహకుల ఆహ్వానం మేరకు హాజరై స్వామివారికి పూజలు చేశారు.

ఘనంగా పాపన్నగౌడ్ జయంతి

డోన్ టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు సర్ధార్ పాపన్నగౌడ్ 375వ జయంతిని జై గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. డోన్‌లోని ఆ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టెర్మినేషన్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

బేతంచెర్ల: మోడల్ స్కూల్ ఫిజికల్ డైరక్టర్లు, కంప్యూటర్ టీచర్లను టెర్మినేషన్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను ఉప సంహరించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ చేపట్టాలి

బనగానపల్లె రూరల్: పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ ఉమ్మడి జిల్లా మాజీ సభ్యుడు దస్తగిరి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పాస్టర్ ప్రవీణ్ చనిపోయి ఆరు రోజులు అవుతున్నా ఇంత వరకు పోస్టుమార్టం రిపోర్టు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

కుందరవాగుకు నీటి విడుదల

సాక్షి ఎఫెక్ట్

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల–భీమునిపాడు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న కుందరవాగుకు అధికారులు నీటిని విడుదల చేశారు. వాగు నీటి ఆధారంగా ఆయా గ్రామాల రైతులు సుమారు 500 ఎకరాల్లో వరి, మిరప, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో రైతులు ఎకరాకు రూ. 20 వేల నుంచి రూ. 30 వేలు వెచ్చించారు. పైరు చేతికందే తరుణంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్న తరుణంలో మార్చి 29వ తేదీ సాక్షి దినపత్రికలో 'కుందరవాగుకు నిలిచిన నీటి సరఫరా' అన్న శీర్షికన వార్త ప్రచురితమైంది. రైతుల సాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు కేసీ కెనాల్ 16వ లాక్ నుంచి కుందరవాగు నీటిని విడుదల చేయడంతో రెండు రోజుల నుంచి వాగు ప్రవహిస్తోంది. వాగులో నీరు చేరడంతో ఆయా గ్రామాల రైతులు పైర్లకు సాగునీటిని మళ్లించుకునే పనుల్లో నిమగ్నమయ్యారు.



కుందర వాగులో ప్రవహిస్తున్న నీరు

చౌడేశ్వరిదేవి ఆదాయం రూ.4.21 లక్షలు



బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో జ్యోతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీల ద్వారా రూ.4,21,438 ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ తెలిపారు. గురువారం కానుకల లెక్కింపు చేపట్టారు. మార్చి 30వ తేదీ నుంచి గురువారం వరకు తాత్కాలిక హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఈ ఆదాయం వచ్చిందన్నారు. దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ మోహన్, పీవీ కుమార్‌రెడ్డి ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
డోన్, బనగానపల్లె
90100 55532 (డోన్)
99122 20581 (బనగానపల్లె)
Office mail : sakshiknladvt@gmail.com